


ప్రభా—

దయచేసి దీన్ని చింపివెయ్యకు. నామీద దయ వుంచి దీన్ని పూర్తిగా చదువు. ఒకసారి పైనుంచి కిందికి చూసేసి 'ఏమిటీ సొద' అని ఉండచుట్టి నీ ఆఫీసు ఆయుదో అంతస్థునుంచి విసిరెయ్యకేం.

నీ రూమ్ బైటనున్న విజిటర్స్‌నీ, నిముషానికొకసారి మోగే నీ టెలిఫోన్‌నీ కొద్దిగా పక్కకు పెట్టి దీన్ని శ్రద్ధగా చదువు. నాకు వ్రాయటంగానీ, మనసులో మాట విపులంగా చెప్పటంగానీ రాదు ఈ 'సరీగా చెప్పలేక పోవటమే'గా మనమధ్య దూరాన్ని పెంచింది. మన మధ్య దూరం ఏమిటి అని ఆశ్చర్య పోకు ప్రభా. ఉంది. కొద్దికొద్దిగా— కొద్దికొద్దిగా ఇది పెరిగింది ఈరాత్రి దీన్ని బద్దలు కొట్టాలనే నిశ్చయించుకొన్నాను.

ప్రభా.. ఎన్నో విషయాలు ఎప్పటి కప్పుడు చెప్పాలని అనుకొనికూడా చెప్పలేక పోతూ ఉంటాను. అయినా యీ విషయాలన్నీ ఎలా చెప్పటం? కొంచం భయం. కొంచం సిగ్గు కూడా వేస్తుంది. అందులో నువ్వు! ఏదైనా మాట్లాడబోతే తలతిప్పి ఒక్క క్షణం సూటిగా 'ఇది జీవితం అనే బిజినెస్‌లో పనికి వచ్చే మాటేనా' అన్నట్టు చూస్తావు. అంతే! ఇక నోటి వెంట మాటరాదు. అందుకే యీ నిశ్శబ్ద అర్ధరాత్రి యిలా ఒంటరిగా కూర్చొని ఇది వ్రాస్తున్నాను. అంత నిశ్శబ్దంగానూ దీన్ని నీ బ్రొవునుకోటు జేబులో పెట్టేస్తాను. నీ టైంటేబిల్ ప్రకారం మంగళవారం నువ్వు తొడుక్కొనేది బ్రౌవునుకోటేగా

క్షమించు ప్రభా. నీ విలువైన సమయాన్ని వృధా చేస్తున్నాను. ఎన్నో చెప్పాలి. ఎలా మొదలుపెట్టాలో అర్థం కావడం లేదు. అసలు ఈ చెప్పాలనుకొన్నవి కొత్త సంగతులేమీ కావు. మనిద్దరికీ తెలిసినవే. కానీ వాటి గురించి ఒకసారయినా నువ్వు ఆలోచిస్తావా అని నా అనుమానం అయినా నా గురించి ఆలోచించడానికి నీ టైంటేబిల్‌లో సమయం కేటాయింపబడ లేదుగా.

లైఫ్‌ని చాలా మామూలుగా తీసుకుంటావు నువ్వు. ఏదో పుట్టినందుకు కొన్ని పనులు చెయ్యాలి కాబట్టి రొటీన్‌గా చేసుకుపోతావు. ఆ చేసే దానికి ఓ ఫీలింగ్ అనేది ఉండదు అదే నాకు బాధగా ఉంటుంది.

నీకు తెలీదు కానీ, నేను ఒక్కదాన్నీ చేసుకునే ప్రార్థనలో నీ గురించి ఏంచేస్తానో తెలీదు కదూ "దేవా. నేనంటే నా భర్తకు కొద్దిగా ప్రేమా, కొంచెం దయా, జాలి, అనురాగం అనేవి పుట్టించు. ఈ ఇంట్లో నేను అనేదాన్ని ఒకదాన్ని ఉన్నానని గుర్తింపు కలిగించు" అని ప్రార్థిస్తూ ఉంటాను.

నీకిదంతా ఆశ్చర్యంగా ఉంటుంది. 'ఇప్పుడు నువ్వేం కష్టపడుతున్నావ్?' అని అడుగుతావ్ కష్టమంటే పెద్ద కష్టమేమీలేదు. ఈ ఏమీ లేకపోవటమే నన్ను బాధిస్తూంది. ఎప్పుడూను. ఏదో సంపాదించుకోవటం, తినటం, పడుకోవటం అయిపోయింది. నాకు పిల్లలు. నీకు ఆఫీసు.. అంతే.

నేను ఎంతగా ఎదురు చూస్తానో తెలుసా ప్రభా.

